క్లుప్తంగా

విద్యార్థులను విడుదల చేయాలి

గజ్వేల్‌రూరల్: అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూలో వేలం వేస్తున్న భూములను వేలం వేయడాన్ని అడ్డుకున్న విద్యార్థులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. హెచ్‌సీయూలో భూముల వేలాన్ని నిలిపివేయడంతో పాటు అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సాగర్, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

గజ్వేల్: పట్టణంలో కొనసాగుతున్న కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ పనులను రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆర్యవైశ్య ప్రముఖులు చంద్రశేఖర్, శ్రీనివాస్, నారాయణ, నేతి శ్రీనివాస్, నంగునూరి సత్యనారాయణ, కై లాస ప్రభాకర్, గోలి సంతోష్ పాల్గొన్నారు.

కోటి తలంబ్రాల దీక్ష


తలంబ్రాలను అందజేస్తున్న లక్ష్మి దంపతులు

మర్కూక్(గజ్వేల్): భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి తమ గోటితో వలిచిన వడ్లను తలంబ్రాలుగా పంపించడం తాము చేసుకున్న పుణ్య ఫలమని అంగడి కిష్టాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి, రాములు గౌడ్ దంపతులు తెలిపారు. రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు నిర్వహించిన కోటి తలంబ్రాల దీక్షలో సోమవారం పాల్గొని గోటితో వడ్లను వలిచి వారు రామరాజుకు అందజేశారు.

చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మేరుగైన వైద్యం అందించడానికి రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింప చేస్తుందన్నారు. కార్పొరేటు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందిన పేదవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు వెంకటస్వామి, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం


ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం

దుబ్బాకరూరల్: మండలంలోని కమ్మర్‌పల్లి ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా పర్స అయ్యన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు సంఘం బాధ్యతలు అప్పగించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మురుగు నీటికి దారేది?


డబుల్ బెడ్రూంల వద్ద నిలిచిన మురుగు నీరు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2021లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో భాగంగా పేదలకు ఇళ్లు పంపిణీ చేశారు. అయితే అక్కడ సీసీ రోడ్లు నిర్మించారు కాని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. దీంతో మురుగు నీరంతా వీధుల్లోను, మోరిల్లోను చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వజృంభిస్తున్నాయి. అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

పడకేసిన పారిశుద్ధ్యం..

దుబ్బాకటౌన్: దుబ్బాకలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్త, గడ్డితో పేరుకుపోయాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్వాసనతో బతకలేక పోతున్నాం..



ఇళ్ళ ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇళ్ల లోను, బయట కూడా ఉండలేని పరిస్థితి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తమ గోడును పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– ఎండీ షఫీ, డబుల్ బెడ్రూంనివాసి

మా భూములు మాకివ్వండి

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి రైతుల వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బెజ్జంకి(సిద్దిపేట): తోటపల్లి రిజర్వాయర్ చేపట్టడం లేనందున ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి ఇవ్వాలని ఆయా నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. మండలానికి కేటాయించిన వ్యవసాయ కళాశాలకు భూమి కోసం సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సర్వే అధికారులు గాగిళ్లాపూర్ శివారులో రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిలో హద్దులను పరిశీలించారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని కళాశాలను ఇతర ప్రభుత్వ భూములలో ఏర్పాటు చేయాలని, తమ భూములను తమకు తిరిగి ఇవ్వాలని కోరుతూ గాగిళ్లాపూర్, తోటపల్లి రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆ భూముల కోసం గతంలో హైకోర్టును ఆశ్రయించామని, కేసు పెండింగ్‌లో ఉందని చెప్పారు. రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిలో రెండు సంస్థలకు మాత్రం 138ఎకరాలు తిరిగి అప్పగించిందని, తమకు అదే విధంగా ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు లేవనెత్తిన సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, సర్వేయర్‌లతో భూములకు హద్దులు నిర్ణయించి జెండా గుర్తులు పాతించారు. కార్యక్రమంలో భూములు కోల్పోయిన రైతులు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటఅర్బన్: పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో సోమవారం ఈ ఘటన జరిగింది. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు దాడిచేసి పట్టుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.7,940, 5 ఫోన్లు, 3 బైకులు స్వాధీనం చేసుకొన్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సన్నబియ్యం పంపిణీ

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్‌లోని రేషన్ షాపుల్లో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అనేక రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు వెంకటి, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రఘుపతి, బాబు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంయోద్దీన్, వెంకటేశ్, వజ్రవ్వ, కవిత పాల్గొన్నారు.

ఖర్చుల కోసం కూలి పనులు


మొక్కజొన్న కంకులు తెంపుతున్న మహిళా నాయకులు

బీఆర్‌ఎస్ మహిళా నాయకుల వినూత్న కార్యక్రమం

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్‌లో ఎప్రిల్ 27న నిర్వహించనున్న సభకు ఖర్చులను సమకూర్చుకోవడానికి బీఆర్‌ఎస్ మహిళా నాయకులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా నాయకులు సోమవారం లక్ష్మీపూర్‌లో ముక్కిస విజయ బాల్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న చేనులో కంకులను తెంపి కూలీ డబ్బులు తీసుకున్నారు. మండలంలో మరిన్ని పనులుచేసి డబ్బులు సమకూర్చుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు నిర్మల, కవిత, చంద్రకళ, అపూర్వ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యరాయణ చిత్రపటాలకు కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం బెజ్జంకిలో క్షీరా భిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'జై సంవిధాన్'

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని కార్యక్రమ నియోజకవర్గ కోఆర్డినేటర్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర్, కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రావుల నర్సయ్య, రాములు, శ్రీనివాస్‌గౌడ్, శ్రావణ్, సందిప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం


చెక్కులను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

ములుగు(గజ్వేల్): సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మండలంలోని దాసర్లపల్లి తండా, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురికి మంజూరైన రూ. 3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చేయూత నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ముత్యాల్‌గౌడ్, నారంరెడ్డి, కృష్ణ, మల్లేశ్‌యాదవ్, నల్ల శ్రీను, బాబు, గోపాల్, భూక్యశ్రీనివాస్, స్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


బైరాన్‌పల్లిలో హార్వెస్టర్లతో వరి కోత

హార్వెస్టర్ల వైపు రైతుల చూపు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. పంట చేతికి అందే సమయం కావడంతో అన్నదాతలు హార్వెస్టర్లతో పంటలు కోయించడానికి సిద్ధమయ్యారు. దీంతో పలు గ్రామాల్లో రైతులు హార్వెస్టర్ల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తోట కమలాకర్‌రెడ్డి కోరారు. మిరుదొడ్డిలో సోమవారం నూతన ఆలయ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి నాడు నిర్వహించే రాములోరి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గ్రామంలోని అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజగోపాలాచారి, వరదాచారి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, మల్లయ్య, రాజు, శ్రీనివాస్, తిరుపతి, మల్లేశం, యాదయ్య, అంజిరెడ్డి, దుర్గయ్య, టెలికాం బోర్డు సభ్యుడు మల్లేశం, ఐలయ్య, రమేశ్, కుమార్, తిరుపతి, నర్సింహారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.5లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న విజయలక్ష్మి, ప్రభాకర్

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎండోమెంట్ పరిశీలకురాలు విజయలక్ష్మి పర్యవేక్షణలో సోమవారం వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలు, తై బజార్ తదితర విక్రయాలకు రూ.5,20,700 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ప్రభాకర్, ఈఓ శర్మ తెలిపారు. టెంకాయల విక్రయానికి రూ.2.09 లక్షలు, తై బజార్‌కు రూ.1.07 లక్షలు, దైవ దర్శనానికి రూ.1.82 లక్షలు లభించాయి. లడ్డు, పులిహోర ప్రసాదానికి 2వ తేదిన వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శర్మ, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం

బ్రహ్మోత్సవాల వేలం పాటల సందర్భంగా వచ్చిన భక్తులు ఎండోమెంట్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆలయ భూమికి హద్దులు నిర్ణయించకపోవడం వల్ల అన్యాక్రాంతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఉత్సవాలలో పనిచేసిన వారికి నెలలు గడిచినా డబ్బులు రావడంలేదని, వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో చెల్లించాలని కోరారు.

ప్రారంభోత్సవానికి ఆలయం సిద్ధం

- నేటి నుంచి 3 రోజుల పాటు ఉత్సవాలు
- 2న విగ్రహాల ప్రతిష్ఠాపన


ముస్తాబైన పోచమ్మ ఆలయం

దుబ్బాక: పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో ఏదుల్లచెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన వరదపోచమ్మ ఆలయం పా్రరంభోత్సవానికి ముస్తాబైంది. వందల యేళ్ల క్రితమే ఈ ప్రాంతంలో కొలువైఉన్న వరదపోచమ్మ విగ్రహం నాలుగేళ్ల క్రితం రోడ్డు మరమ్మతులు జరుగుతున్న క్రమంలో టిప్పర్ బోల్తాపడి ఆలయం ధ్వంసమైంది. దీంతో దాని స్థానంలో దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు.

ఉత్సవాల వివరాలు ఇలా...

ఒకటో తేదీన ఉదయం గణపతిపూజతో కార్యక్రమాలు మొదలవుతాయి. బుధవారం మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి యంత్ర విగ్రహ స్పర్శణం చేయనున్నారు. అలాగే గురువారం మంటపారాధన, గర్త సంస్కారం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ బాధ్యుడు మల్లుగారి నర్సింహారెడ్డి తెలిపారు. వైదిక నిర్వహణ వేలేటి జయరామశర్మ, రామకృష్ణ శర్మ, రాఘవశర్మల ఆధ్వర్యంలో జరుగుతాయి.

3న భవన నిర్మాణ కార్మిక మహాసభ

కోహెడరూరల్(హుస్నాబాద్): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శ్రామిక భవన్‌లో 3న జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండలంలోని నారాయణపురంలో తిరుపతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కార్మికునికి పెళ్లి, డెలవరీ కేసులకు ఇస్తున్న రూ.30 వేలు సహాయాన్ని లక్షకు పెంచాలన్నారు. సహజ మరణానికి రూ.5లక్షల వరకు పెంచాలని, గీత, నేత కార్మికులకు ఇచ్చే విధంగా 50 యేళ్లు నిండిన కార్మికుడికి రూ.6 వేలు పెంఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే లేబర్ కార్డుల రెన్యూవల్‌ను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్, జిల్లా అధ్యక్షుడు సంపత్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


మద్దూరులోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ సూక్తులను బోధించారు. ఒక్కరికొక్కరు ఈద్ ముబారక్ చెప్పుకొని ప్రేమానురాగాలను చాటుకొన్నారు. వివిధ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.


కొండపాక(గజ్వేల్): దుద్దెడలోని ఈద్గా వద్ద ..


దుబ్బాకటౌన్: దుబ్బాకలోని ఈద్గాలో..

సమానత్వానికి ప్రతీక రంజాన్

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి


ప్రభాకర్ రెడ్డి, వెంకటయ్యను సత్కరిస్తున్న సుల్తాన తదితరులు

దుబ్బాకటౌన్: సర్వ మానవ సమానత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. రాయపోల్‌లో ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ నివాసంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం దీక్షలు, ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందన్నారు. అల్లా దీవెనతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాయపోల్ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్, బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, రాజేందర్, అఫ్జలొద్దీన్, నందు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతాప్‌రెడ్డి


అత్తు ఇమామ్‌కు స్వీటు తినిపిస్తున్న మైనంపల్లి

ఐక్యతకు సిద్దిపేట నిదర్శనం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


శుభాకాంక్షలు తెలుపుతున్న హరికృష్ణ

సిద్దిపేటజోన్: హిందూ, ముస్లింల ఐక్యతకు సిద్దిపేట ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం స్థానిక ఎక్బాల్ మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ మతాలకు అతీతంగా శాంతిని, సోదర భావాన్ని సిద్దిపేట నేర్పిందన్నారు. సిద్దిపేటలో ఐదు ఎకరాల స్థలంలో ఖబరాస్థాన్ నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు, నాయకులు బుచ్చిరెడ్డి, వాహిద్ ఖాన్, ఆనంద్, ఎల్లం రియాజ్, మహేందర్ పాల్గొన్నారు.